‘డబుల్’.. వసూల్!

- కమిటీల పేరుతో అక్రమ వసూళ్లు
- అక్రమార్కులకు వరంగా మారుతున్న డబుల్‌బెడ్‌రూమ్‌లు
- ప్రశ్నిస్తే కరెంట్ కట్, నీళ్లు బంద్

పేద, మధ్య, తరగతి ప్రజలకు అందజేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పుడు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. సంక్షేమ సంఘం ప్రెసిడెంట్.. వైస్ ప్రెసిడెంట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ డబ్బులు దండుకుంటున్నారు. ఇదేమటని ప్రశ్నిస్తే ‘మీకు దిక్కున చోట చెప్పుకో’ అంటూ బెదిరిస్తున్నారు. కరెంట్ కట్ చేస్తున్నారు.. నీళ్లు బంద్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 10న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కలిసి తమ గోడును చెప్పుకుంటూ లబ్ధిదారులు కన్నీళ్ల పర్యంతమయ్యారు.


డబుల్‌బెడ్‌రూమ్ సముదాయం


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలో ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ సముదాయాలను నిర్మించి లబ్ధిదారులకు కేటాయించింది. సంవత్సర కాలంగా కమిటీ పేరుతో అక్రమార్కులు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు అక్రమార్కులతో చెయ్యి కలిపి అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సభ్యత్వం, మెయింటెనెన్స్ పేరిట..

బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ ఇక్కడ తంతు వేరేలా ఉంది. ప్రతి నెల మెయింటెనెన్స్ పేరిట వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా తాజాగా సభ్యత్వం పేరిట రూ.1100 వసూళ్లకు శ్రీకారం చుట్టడం విశేషం. ప్రశ్నించిన వారిపై ప్రత్యక్ష దాడులకు కూడా సిద్ధపడినట్లు తెలుస్తోంది.

2023 నుంచి ఇబ్బందులే...

బహదూర్‌పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు మౌలిక వసతులు కల్పించలేదు. ఇదే ఆసరాగా చేసుకొని కొంతమంది తమకు తామే కమిటీని ఎంపిక చేసుకొని ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లుగా చెలామని అవుతున్నారు. అందిన కాడికి దండుకుంటున్నారు. మొత్తం ఎనిమిది బ్లాకుల్లో 900 ప్లాట్లు నిర్మించారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా 780 ప్లాట్లను పంపిణీ చేసింది. నియోజకవర్గ ప్రాంతానికి చెందిన వారే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సైతం ఇందులో డబల్ బెడ్ రూమ్ అందజేసింది. నాటి నుంచి నేటి వరకు తాము ఇబ్బందుల పాలవుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని, ఇక్కడ దళారులు మా వద్ద డబ్బులు వసూలు చేసి జల్సాలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తా

బహదూర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం గతంలో వెలుగులోకి వచ్చింది. వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయాలని సంక్షేమ సంఘం ప్రతినిధులకు చెప్పాం. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తా. డబ్బుల విషయంపై తేడాలు వస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తాం.

– సుధాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ టెక్నికల్

నేడు ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ ప్రెసిడెంట్ నాగేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లికి చెందిన నెర్గస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి బాలయ్యనగర్ కమ్యూనిటీ హాల్ దగ్గర ఉచిత వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, మందులు అందజేయనున్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

జీడిమెట్ల: సరస్వతి పుష్కరాలకు జీడిమెట్ల డిపో నుంచి స్పెషల్ బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల నుంచి 10 మెట్రో డిలక్స్ బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. 10 నుంచి 20 మంది వరకు జగద్గిరిగుట్ట, గండిమైసమ్మ, షాపూర్‌నగర్, అపురూపా కాలనీ నుంచి వెళ్లాలి అనుకుంటే డిపో మేనేజర్‌కు ఫోన్ ద్వారా తెలియజేస్తే నేరుగా బస్సు కాలనీకి పంపిస్తామని తెలిపారు. బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.820, చిన్నపిల్లలకు రూ.420 గా నిర్ణయించామన్నారు. 15 నుంచి 26 వరకు బస్సులను నడుపనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 7382817481లో సంప్రదించాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ కాలనీకి చెందిన చిన్నారి డి. వశిష్ట (15) అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేకానంద్ సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 1.10 లక్షల ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించారు. సదరు చెక్కును బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ, శేషాచారి, అనిల్ కుమార్, విజయ్ కుమార్, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల క్షేమం కోసం .. మృత్యుంజయ మహామంత్ర స్మరణ



కుత్బుల్లాపూర్: సైనికుల క్షేమం కోసం బుధవారం షాపూర్‌నగర్‌లోని శివ శక్తి ధ్యాన యోగా ఆధ్వర్యంలో సామూహిక మృత్యుంజయ మహామంత్రం ధన్వంతరి మంత్ర స్మరణ చేశారు. పాకిస్తాన్, భారత్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుల కోసం మౌనం పాటించారు. భారత దేశం క్షేమం కోసం బుద్ధుడు సూచించిన మార్గంలో ధ్యానం చేశారు. కార్యక్రమంలో శివ శక్తి ధ్యాన యోగా సాధక బృందం, సత్సంగం బృందం శివ శక్తి ధ్యాన యోగా వ్యవస్థాపకులు కొడ మల్లేష్ పాల్గొన్నారు.

చెత్తను తొలగించరూ!



జీడిమెట్ల: ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని పారిశ్రామికవాడలో కొంతమంది రోడ్ల పక్కన చెత్తాచెదారాలు కుప్పలు కుప్పలుగా డంప్ చేస్తున్నారు. వర్షం పడ్డప్పుడు చెత్త కొట్టుకుపోయి నాలాలో పడి నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుపడుతుంది. ఈ విషయమై పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చెత్తను తీయించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

రైల్వే ఎఫ్ఓబీపై చైన్‌స్నాచింగ్

సనత్‌నగర్: రైలెక్కేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఓ మహిళ మెడలోని 26 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పరారైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శేరిలింగంపల్లి కొండాపూర్ టీజీఎస్పీ 8వ బెటాలియన్ పాత క్వార్టర్స్‌లో నివాసముండే పాతకోకల కుమారి (34) సనత్‌నగర్‌లోని ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో ఉద్యోగం చేస్తుంది. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో మంగళవారం రాత్రి 7.21లకు భరత్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. హైటెక్ సిటీకి వెళ్లడానికి టికెట్ తీసుకుని మరోవైపు ఉన్న ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఎదురుగా వచ్చి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త డంప్!



రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను డంప్ చేయవద్దనే నిబంధనలను చెత్త సేకరణ ఆటోరిక్షా కారికులు ఉల్లంఘిస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఇళ్ల నుంచి ప్రతి నిత్యం 320 టన్నుల పైచిలుకు చెత్త వ్యర్థాలను జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులో సెకండరీ కలెక్షన్ పాయింట్‌కు చేరవేస్తున్నారు. సెకండరీ కలెక్షన్ పాయింట్ సమీపంలోనే గుట్టలుగా చెత్తను పోస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ


కేసుల వివరాలు తెలుసుకుంటున్న సీపీ అవినాష్ మహంతి

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రాత్రి సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తనిఖీ చేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డితో కలిసి పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. కేసుల పురోగతిపై సీఐ భరత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలని అని సీపీ సూచించారు.

కీసర ఇన్‌చార్జ్ ఎంఈఓగా జమదగ్ని

కీసర: కీసర మండల నూతన ఇన్‌చార్జ్ ఎంఈఓగా రాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జమదగ్ని నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ శశిధర్ స్థానంలో జమదగ్ని నియమితులైనట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పీఆర్‌టీయూటీఎస్ కీసర మండల అధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సనత్‌నగర్: ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ..వరంగల్ చిట్యాల్‌కు చెందిన పాలవెల్లి శ్రీనాథ్ (35) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 2020లో జోత్స్న అనే యువతిని వివాహం చేసుకుని మోతీనగర్‌లోని ఎస్‌వీఎస్‌బీకేఎం హైట్స్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం వీరికి ఓ బాబు ఉన్నాడు. జ్యోత్స్న తన సోదరుడి వివాహం ఉండడంతో పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న శ్రీనాథ్ తన సోదరుడు శ్రీకాంత్‌తో కలిసి ఈ నెల 12న ఓ కార్యక్రమానికి వెళ్లివచ్చారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు సోదరుడు శ్రీకాంత్ బైక్ తాళాల కోసం శ్రీనాథ్ ఇంటికి వచ్చి తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు పగులగొట్టి చూడగా శ్రీనాథ్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఎస్ఐలకు సెక్టార్ల కేటాయింపు

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో ఉన్న ఐదు సెక్టార్లకు బదులు మరో సెక్టార్‌కు అదనంగా ఏర్పాటు చేసి ఎస్ఐలకు సిఐ విజయవర్ధన్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు, ఇతర చిల్లర గొడవలు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు వెంటనే తెలియపరిచే విధంగా సెక్టార్ ఎస్ఐలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా సంక్షేమ సంఘాల వారితో మమేకమై రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 తో పాటు ఎస్ఐలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ -87126 63248, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే విజయ వర్ధన్-9490617229, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్-8712663249.

సెక్టార్ల వారీగా ఎస్ఐల ఫోన్ నంబర్లు

సెక్టార్-1 ఎస్ఐ సి.నర్సింహులు- 949021 3722,
సెక్టార్-2 ఎస్ఐ లావణ్య - 8712568342,
సెక్టార్ -3 ఎస్ఐ ధర్మేష్ -8712568129,
సెక్టార్-4 ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి-8712568384,
సెక్టార్ -5 ఎస్ఐ సురేందర్ రెడ్డి-8712568203,
సెక్టార్-6 ఎస్ఐ నరసింహులు గౌడ్-8712568146

ఫోన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా సెక్టార్ల వారీగా సమస్యలు ఉంటే నేరుగా ఎస్ఐలకు ఫోన్ చేసి సమస్యను వివరించవచ్చని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


చెక్కు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బులాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం స్వప్నకు రూ.15 వేలు, తమ్మాలి నర్సింహ, మహేష్‌గౌడ్‌లకు ఒక్కొక్కరికి రూ.60 వేల చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలను అందించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంక్షేమ సంఘాల నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ@100 శాతం ఫలితాలు

'పది'లో టాపర్‌గా కార్తీక్ ఆనంద్.. 98.6 శాతం మార్కులు



రాయదుర్గం: సీబీఎస్ఈ ఫలితాల్లో గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ వంద శాతం ఫలితాలు సాధించింది.పదవ తరగతి టాపర్‌గా కార్తీక్ ఆనంద్ 98.6 శాతం మార్కులు సాధించాడు. 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 37 మంది విద్యార్థులు 90 శాతం పైనే మార్కులు సాధించడం మరో విశేషం. అలాగే 12వ తరగతిలో 50 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.

మ్యాథ్స్, సైన్స్ ఇష్టం



నాకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు అంటే చాలా ఇష్టం . ఇంటర్మీడియట్‌లో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటా. మా తండ్రి నల్లతంబి బ్యాంకు ఉద్యోగి. కేంద్రీయ విద్యాలయలో 1వ తరగతి నుంచి చదువుతున్నాను, బోధనలో, క్రమశిక్షణ ఆచరించేలా ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ చూస్తారు. నాకు ఫుట్‌బాల్ ఆడడం చాలా ఇష్టం.

– పదవ తరగతి టాపర్ కార్తీక్ ఆనంద్

ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల..



ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, పోటీతత్వంతో చదవడంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం కలిగింది. పది, ప్లస్2లో 100 శాతం ఫలితాలను ఆరంభం నుంచి సాధిస్తూ వస్తున్నాం.ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది.

– జితేంద్రకుమార్, ప్రిన్సిపాల్, కేంద్రీయ విద్యాలయ, గచ్చిబౌలి

పెంచిన ఫీజులను ప్రభుత్వమే భరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన ఇంజినీరింగ్ కోర్సుల ఫీజుల భారాన్ని ప్రభుత్వం భరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెంచిన ఫీజుల భారాన్ని వేయడంతో అనేక మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పథకాలు, ఉచితాలతో లక్షల కోట్ల సంపదను ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు భరించలేరా అని ప్రశ్నించారు. బీసీలకు 20 ర్యాంక్‌లోపు నిబంధనను ఎత్తివేయాలన్నారు.

పోస్టర్ విడుదల

సనత్‌నగర్: భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పోస్టర్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) నిషేధించడం, సక్రమంగా వ్యర్థాల నిర్వహణ చేపట్టడం వంటి వాటిపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా వాహన కాలుష్యం, వాహన రద్దీ తగ్గుతుందన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం



రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యమని తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేషకుమార్ పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజసేవ, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం లక్ష్యం అని అన్నారు. సైనికులకు ఇచ్చే తరహాలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణా శిబిరంలో రంగారెడ్డిజిల్లాకు చెందిన 600 మంది కాలేజీ విద్యార్థులు, 12 పాఠశాలలకు చెందిన క్యాడెట్లు పాల్గొంటున్నారన్నారు. ఈనెల 17వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్, గణేష్, సబ్ మేజర్ కిషోర్‌సింగ్ ఏఎన్‌ఓ ఆఫీసర్లు, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం



దుండిగల్: రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఆ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వీఎస్ఆర్ కళాశాల నుంచి భౌరంపేటలోని బొమ్రాయి వరకు వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ముఖ్యంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుపై ఏర్పడిన గుంతలో లీకైజీ అయిన డ్రైనేజీ నీటితో పాటు ఇటీవల కురుస్తున్న వర్షానికి నీరు చేరడంతో చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఇటీవల ఇదే గుంతల్లో మున్సిపల్ అధికారులు కేవలం మట్టిని నింపి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

‘డిగ్రీ’కి ఎదురు చూపులు !

ప్రతి ఏటా ఉన్నత విద్యకు దూరమవుతున్న పేదలు

- ప్రభుత్వ కళాశాల మంజూరు కోసం విద్యార్థి సంఘాల పోరాటం
- హామీని విస్మరిస్తున్న పాలకులు


డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల ధర్నా (ఫైల్)

మేడ్చల్ : మేడ్చల్ పరిసర ప్రాంతాల పేద విద్యార్థులు ఉన్నత చదువు చదువుకోవాలనే ఆశ ఏళ్లుగా నెరవేరడం లేదు. నియోజకవర్గంలో 6 లక్షల మందికి పైగా జనాభా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మాత్రం మంజూరు చేయడం లేదు. ఏళ్లుగా పేద విద్యార్థుల కోసం విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేస్తున్నా.. ఫలితం మాత్రం రావడం లేదు. ఎన్నికల సమయంలో మేడ్చల్, ఘట్‌కేసర్‌లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తామని, ప్రతిపార్టీ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల హామీ ఇస్తున్నారే తప్పా.. గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ నియోజకవర్గంలో మేడ్చల్, శామీర్‌పేట్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, యాదాద్రి జిల్లాల శివారు మండలాల ప్రాంతాల విద్యార్థులు మేడ్చల్‌లోనే ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్నారు. మేడ్చల్‌లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి. ఇంటర్ వరకు పేద విద్యార్థులు తమ చదువులను మేడ్చల్‌లోనే కొనసాగిస్తూ.. ఉన్నత చదువుల కోసం నగరానికి వెళ్లలేక చదువులు సగంలోనే మానేస్తున్నారు.

ఎన్నికల హామీగానే..

మేడ్చల్, ఘట్‌కేసర్ మండలాల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని దాదాపు 20 ఏళ్లుగా గెలిచిన ఎమ్మెల్యేలు, పోటీ చేసి ఓడిన వారు చెబుతున్నారే గానీ ఏ నాయకులు పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించాలని ఏనాడు ప్రయత్నించలేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యార్థుల పోరాటాలు..

విద్యార్థి సంఘాల నాయకులు ఏళ్ల తరబడి డిగ్రీ కళాశాల కోసం ఉద్యమాలు చేస్తున్నా.. మంజూరీ మాటలకే పరిమితం అవుతోంది. విద్యార్థి సంఘాల జేఏసీగా ఏర్పడి ఏళ్ల తరబడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధనకు పోరాటాలు చేస్తున్నారు. ర్యాలీలు, విద్యార్థుల ప్రదర్శనలు, మంత్రుల, ఎమ్మెల్యేల పర్యటనలు అడ్డుకోవడం, సమావేశాల్లో నిలదీయడం, ధర్నాలు, రాస్తారోకో వంటి ఎన్నో కార్యక్రమాలు చేసినా వారికి పోలీసులు కేసులు తప్పా.. ఫలితం మాత్రం లేకుండా పోయింది.

గత ప్రభుత్వ హయాంలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు రెండు డిగ్రీ కళాశాలలు మంజూరైనా.. అవి మేడ్చల్‌కు రాలేదు. ఉప్పల్, రాజేంద్రనగర్‌లకు వెళ్లడంతో గతేడాది మేడ్చల్‌కు భంగపాటు తప్పలేదు ఈ నూతన సంవత్సరంలోనైనా మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరవుతుందని విద్యార్థులు కోటి ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

నగరానికి వెళ్లలేక..

నియోజకవర్గంలో 7 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 5 మండలాలు ఉన్నా.. మేడ్చల్‌లో మినహా ఎక్కడ ప్రభుత్వ ఇంటర్ కళాశాల, డిగ్రీ కళాశాల లేకుండా పోయింది. గురుకులాలు ఉన్నా.. అవి అందరికీ ఉపయోగపడటం లేదు. పేద విద్యార్థులు గ్రామాల నుంచి నగరానికి వెళ్లలేక ప్రైవేటులో ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పట్టుబట్టి చదువుతున్న వారి తల్లింతండ్రులు ప్రైవేటు దోపిడీకి అప్పుల పాలవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ విద్యా సంవత్సరంలో మేడ్చల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు వస్తుందేమోనని పేద విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.